క్లుప్తంగా

మలేరియా సర్వే

అశ్వారావుపేటరూరల్: మలేరియా ప్రభావిత గ్రామాల్లో సోమవారం కుడా మలేరియా సర్వే కొనసాగింది. మండలంలోని చెన్నాపురం గ్రామంలో సబ్ యూనిట్ అధికారి అజ్మీర వెంకటేశ్వరరావు పర్యవేక్షణలో సుమారు 406 మందికి మలేరియా నిర్ధారణ పరీక్షలు చేయగా.. ఎటువంటి కేసులూ నమోదు కాలేదు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అధిక ఎండలతో నేపథ్యంలో ఉదయం 10 గంటల లోపు, సాయంత్రం 4 గంటల తర్వాత బయటకు రావాలని సూచించారు. కార్యక్రమంలో ఎంటీఎస్ విజయ్‌రెడ్డి, హెల్త్ అసిస్టెంట్ పి.వెంకటేశ్వర్లు, ఏఎన్ఎం రాధాబాయి, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

బూర్గంపాడు: మోరంపల్లిబంజర పీహెచ్‌సీ ఆధ్వర్యంలో దేవయ్యగుంపు, సింగారం వలస ఆదివాసీ గ్రామాలలో సోమవారం మలేరియా నిర్ధారణకు రక్తపూతల సేకరణ చేపట్టారు. పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ లక్ష్మీసాహితి ఆధ్వర్యంలో సామూహిక రక్త శ్యాంపిళ్లను సేకరణ చేపట్టారు. ఈ శ్యాపిళ్ల రిపోర్ట్‌ల ఆధారంగా వైద్యసేవలను అందించేందుకు చర్యలు తీసుకుంటామని వైద్యాధికారి తెలిపారు. కార్యక్రమాన్ని ఏఎమ్‌ఓ గొంది వెంకటేశ్వర్లు పరిశీలించి వైద్యసిబ్బందికి పలు సూచనలు చేశారు. వైద్యసిబ్బంది జీతు, రవి, రమణ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

శివపార్వతుల కల్యాణం

అన్నపురెడ్డిపల్లి: మండల కేంద్రంలో కొలువుదీరిన భ్రమరాంబ సమేత మల్లిఖార్జున స్వామి వారి ఆలయంలో సోమవారం మాస శివ రాత్రిని పురస్కరించుకొని శివపార్వతుల కల్యాణాన్ని కన్నుల పండుగగా జరిపించారు. ఉదయం నుంచి స్వామి వారికి అభిషేకాలు, రుద్రాభిషేకం తదితర పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం స్వామి వారి కల్యాణాన్ని ఆలయ అర్చకులు సత్యనారాయణశర్మ, సాయిలు మంగళ వాయిద్యాల నడుమ శాస్త్రోక్తంగా జరిపించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కల్యాణం అనంతరం భక్తులకు ఆలయ ప్రాంగణంలో అన్నదానం జరిపించారు. ఆలయ అభివృద్ధి కోసం గుబ్బల వరలక్ష్మి, భాస్కరరావు దంపతులు రూ.5 వేలు ఆలయ సిబ్బందికి అందజేశారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండ ఆలయ అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు.

లైన్ ఇన్‌స్పెక్టర్ మృతి

అశ్వాపురం: మండలంలో విద్యుత్ శాఖ అశ్వాపురం లైన్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వర్తిస్తున్న కొనకంచి మోహన్‌రావు(56) మృతి చెందారు. గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న మోహన్‌రావు హైదరాబాద్‌లో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ.. సోమవారం రాత్రి మృతి చెందారు. ఆయన మృతిపై విద్యుత్ శాఖ ఏఈఈ, సిబ్బంది, మణుగూరు ఏడీఈ సంతాపం వ్యక్తం చేశారు. కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

మంత్రి పరామర్శ

దమ్మపేట: అనార్యోగంతో బాధపడుతున్న సీనియర్ కాంగ్రెస్ నాయకులు, మాజీ ఎంపీపీను రాష్ట్ర వ్యవసాయ, సహకార శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పరామర్శించారు. దమ్మపేట గ్రామానికి చెందిన సీనియర్ నాయకుడు, మాజీ ఎంపీపీ పానుగంటి సత్యం గత కొద్దిరోజులుగా అనారోగ్య కారణాల వలన చికిత్స పొంది, ఇంటివద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. విషయం తెలుసుకున్న మంతి తుమ్మల, సోమవారం దమ్మపేటలో పానుగంటి సత్యంను పరామర్శించి, ఆరోగ్య వివరాలను అడిగి తెలుసుకున్నారు. అదే గ్రామంలో కందుకూరి నాగార్జున కుమార్తెకు ఇటీవలే వివాహం జరుగగా, నూతన దంపతులను ఆశీర్వదించారు. నాయకులు రావు గంగాధర రావు, చిన్నశెట్టి యుగంధర్, అత్తులూరి వెంకటరామారావు, కాసాని నాగప్రసాద్, కొయ్యల అచ్యుతరావు, కక్కిరాల రమేష్, పగడాల రాంబాబు, వలీపాషా పాల్గొన్నారు.

కాంగ్రెస్ విస్తృత ప్రచారం

దమ్మపేట: ఖమ్మం ఎంపీ అభ్యర్థి రామ సహాయం రఘురాం రెడ్డి గెలుపును కాంక్షిస్తూ, మండలంలోని పలు గ్రామాల్లో కాంగ్రెస్ నాయకులు సోమవారం విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఎన్నికల తేదీ దగ్గరకు వస్తున్న తరుణంలో కాంగ్రెస్ నాయకులు తమ ప్రచార వేగాన్ని పెంచారు. కాంగ్రెస్ పార్టీ హయంలో జరుగుతున్న సంక్షేమం, అభివృద్ధి గురించి ఓటర్లకు వివరిస్తూ, ఇంటింటికి కరపత్రాలను పంచారు. రావు గంగాధరరావు, కోటగిరి సత్యంబాబు, చిన్నశెట్టి యుగంధర్, పర్వతనేని ప్రసాద్, అత్తులూరి వెంకటరామారావు, కక్కిరాల రమేష్, సాయిల నర్సీ, పగడాల రాంబాబు, రొయ్యల కుమార్ పాల్గొన్నారు.

కుల ధ్రువపత్రాలు ఇవ్వాలి

చర్ల: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం నుంచి వలస వచ్చి తెలంగాణాలో నివాసం సాగిస్తున్న వలస గొత్తికోయలకు ఎస్టీ కుల ధ్రువపత్రాలివ్వాలని కాంగ్రెస్ పార్టీ చర్ల మండల నాయకులు సోమవారం రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి వినతిపత్రాన్ని అందజేశారు. ఖమ్మంలో మంత్రిని నకలిసిన కాంగ్రెస్ నాయకులు గొత్తికోయల పరిస్థితిని ఆయనకు వివరించడంతో ఆయన సానుకూలంగా స్పందించారు.. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. మంత్రిని కలిసిన వారిలో జెడ్పీటీసీ ఇర్పా శాంత, చర్ల సహకార సంఘ అధ్యక్షుడు పరుచూరి రవికుమార్, నాయకులు చీమలమర్రి మురళీకృష్ణ, దేవభక్తుని రామకృష్ణ, ఎస్సీ సెల్ నాయకులు తోటమళ్ల వరప్రసాద్ తదితరులు ఉన్నారు.

ఎన్నికల వేళ 'బెల్ట్' బాగోతం

- దాడులు జరుగుతున్నా బేఖాతర్
- రహస్యంగా జోరందుకుంటున్న అమ్మకాలు
- క్వార్టర్‌కు రూ.100కు పైగా దోపిడీ



అశ్వారావుపేట: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో మద్యం బహిరంగ విక్రయాలు చేపట్టరాదని, బెల్టు షాపులు మూసేయాలని అధికారులు ముందస్తుగా హెచ్చరించారు. పైకి దుకాణాలు మూసేసినట్లు నటించే బెల్ట్ షాపుల నిర్వాహకులు.. స్మార్ట్‌గా వినియోగదారులను దోచుకుంటున్నారు. కోడ్ అమలులో లేనప్పుడు ఎమ్మార్పీ కంటే మద్యం సిండికేట్ వ్యాపారులు రూ.20 పెంచి బెల్ట్ షాప్ నిర్వాహకులకు అమ్మేవారు. వీరు మరో రూ.20కి పెంచి బెల్ట్ షాపుల్లో విక్రయించేవారు. వేలాది మంది మద్యం ప్రియులు బహిరంగంగా వైన్ షాపు వద్ద క్యూ కట్టలేక... పోనీ 40 రూపాయలే కదా.. పక్కనే సోడా, మంచింగ్ దొరుకుతుందని బెల్ట్ షాపుల పైనే ఆధారపడ్డారు. ఏళ్ల తరబడి అలవాటైన దోపిడీ కాబట్టి ఈ రూ.40 దోపిడీ అంతగా బాధించలేదు. కానీ ఎన్నికల నిబంధనల పేరుతో బెల్ట్ షాపుల నిర్వాహకులు మరింత దోచేస్తున్నారని వాపోతున్నారు.

లాక్‌డౌన్ తరహా దోపిడీ..

లాక్‌డౌన్ సమయంలో అశ్వారావుపేట పరిసర ప్రాంతాల్లో క్వార్టర్ బాటిల్‌కు రెండు, మూడు రెట్లు పెంచి అమ్మేవారు. చాటుమాటుగా అమ్మేవారి వద్ద ఎగబడి మరీ కొనుక్కునే వారు. ఇప్పుడు అదే తరహాలో దోపిడీ జరుగుతోందని మద్యం ప్రియులు వాపోతున్నారు. రూ.160 ఉండే ఓ బీర్ రూ.260 కి విక్రయిస్తున్నారట. కొన్ని ప్రముఖ కంపెనీల క్వార్టర్‌లు రూ.160 విలువైనవి రూ.350కి విక్రయిస్తున్నారట. బ్రాందీ షాపుల్లోకి వెళితే కావాల్సిన బ్రాండ్లు ఉండవట. బీర్లు అసలు కూలింగ్ లేవు. వేడి బీర్లు ఉంటాయి కావాలంటే తీస్కో.. లేకుంటే పో అని మర్యాద లేకుండా వ్యవహరిస్తున్నారంటున్నారు.

అదీ కాక ఇప్పుడంతా డిజిటల్ లావాదేవీలే అయినా.. అశ్వారావుపేట సిండికేట్ వ్యాపారులు డిజిటల్ పేమెంట్లును ఆమోదించరట. దీంతో చచ్చినట్లు బెల్టు షాపుల వద్దకు వెళ్లి అక్కడే అధనపు చెల్లింపులు చేసి మద్యం కొనుగోలు చేయాల్సి వస్తోందని వాపోతున్నారు. ఎన్నికల కమిషన్ నియమించిన అధికారులు నిత్యం దాడులు చేస్తూనే ఉన్నారు.. కానీ మద్యం అక్రమ అమ్మకాలు మాత్రం ఆపలేక పోతున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

దొంగచాటేగానీ బహిరంగం..

ఓపక్క దాడులు జరుగుతున్నాయని.. బెల్టు షాపులను మూసేసి ఉంచుతారు. కానీ మద్యం నిల్వలు మాత్రం చుట్టుపక్కల ఏదో ఒక ఇంట్లో ఉంచుతారు. ఓ టూవీలర్(స్కూటీ) బెల్ట్ షాపుకు ఆమడ దూరంలో నిలిపి ఉంటుంది. మద్యం ప్రియుడు డబ్బులు చేతిలో పెట్టిన తర్వాత టూవీలర్ సీటు కింద డిక్కీలో నుంచి మద్యం బాటిల్‌ను తెచ్చి చేతికిచ్చి చుట్టుపక్కల ఉండకుండా వెళ్లిపోవాలని సూచిస్తారు. ఇదే తంతు ప్రతి బెల్ట్ షాపు వద్ద నిత్యకృత్యం. అయినా కేసులు నామమాత్రమే. కొన్ని సందర్భాల్లో దాడులు చేసిన మద్యం బాటిళ్లు దొరక్కుండా బెల్ట్‌బాబులు జాగ్రత్త పడ్డ సందర్భాలూ ఉండనే ఉన్నాయి. ఇంత పకడ్బందీగా ఆంక్షలు అమలవుతున్నా.. బెల్ట్ షాపులకు మద్యం సరఫరా మాత్రం యథేచ్ఛగానే సాగుతోంది. ఈ మతలబు ఎవరికీ అంతుపట్టకుండా ఉంది. మద్యం అక్రమ రవాణాను అరికడితే ఇన్ని బెల్ట్ షాపులపై దాడులు చేయాల్సిన అవసరం ఉండదు కదా. అదే విధంగా లైసెన్స్‌డ్ మద్యం దుకాణాల్లో అన్ని బ్రాండ్‌లను అమ్మేలా కూడా అధికారులు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

దాడులు నిర్వహిస్తూనే ఉన్నాం..

బెల్ట్ షాపులు, దాబాలలో మద్యం విక్రయాలు జరుగకుండా నిత్యం 24 గంటలు తనిఖీలు నిర్వహిస్తున్నాం. దాడుల్లో పట్టుబడిని వారిపై కేసులు నమోదు చేస్తున్నాం. అశ్వారావుపేట, దమ్మపేట మండలాల్లో అత్యధికంగా కేసులు నమోదు చేశాం. ఎన్ని మార్గాల్లో మద్యం అక్రమ విక్రయాలు నిర్వహించినా పసిగట్టుతున్నాం. బెల్ట్ షాపుల సమీపంలో నిలిపి ఉంచే వాహనాలపై నిఘా ఉంచుతాం.

– కృష్ణ, విజిలెన్స్ అధికారి

అభివృద్ధి చేశా.. ఆశీర్వదించండి



అన్నపురెడ్డిపల్లిలో మాట్లాడుతున్న నామా నాగేశ్వరరావు

అన్నపురెడ్డిపల్లి: పది సంవత్సరాలు ఎంపీగా జిల్లాని అభివృద్ధి చేశానని, ఈ ఎన్నికలలో తనను ఆశీర్వదించి, గెలిపించాలని ప్రజలను బీఆర్ఎస్ అభ్యర్థి, ఎంపీ నామా నాగేశ్వరరావు కోరారు. సోమవారం అన్నపురెడ్డిపల్లి మండల కేంద్రంలో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆయన పాల్గొన్నారు. తొలిత శివాలయం నుంచి భారీ ర్యాలీగా ప్రధాన సెంటర్‌లోని అంబేద్కర్ కూడలికి చేరుకున్నారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి, అనంతరం ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన మేనిఫెస్టోని చదివి, ప్రజలను ఎలా కాంగ్రెస్ పార్టీ మోసం చేసిందో వివరించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు తాటి వెంకటేశ్వర్లు, మెచ్చా నాగేశ్వరరావు, డీసీసీబీ మాజీ చైర్మన్ కూరాకుల నాగభూషణం, జెడ్పీటీసీలు భారత లాలమ్మ, సున్నం నాగమణి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు బోయినపల్లి సుధాకర్, వైస్ఎంపీపీ మామిళ్లపల్లి రామారావు, ఎంపీటీసీ కృష్ణారెడ్డి, హరీష్, చల్లా రమేష్, భారత రాంబాబు, చల్లా రాంబాబు పాల్గొన్నారు.

చంద్రుగొండ: ఆరు గ్యారంటీల హామీలు ఏమైయ్యాయని ఓట్ల కోసం గ్రామాల్లోకొచ్చే కాంగ్రెస్ నాయకులను నిలదీయాలని బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి నామా నాగేశ్వరరావు ప్రజలకు పిలుపునిచ్చారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం రాత్రి చంద్రుగొండలో ఏర్పాటు చేసిన కార్నర్ మీటింగ్‌లో మాట్లాడారు. మోసపూరిత హామీలతో అధికారం చేపట్టిన కాంగ్రెస్ మళ్లీ మరోమారు పార్లమెంటు ఎన్నికల ఓట్ల కోసం మీ ముందుకు వస్తుందన్నారు. సమావేశంలో డీసీసీబీ చైర్మన్ కూరాకుల నాగభూషణం, మాజీ ఎమ్మెల్యేలు మెచ్చా నాగేశ్వరరావు, తాటి వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీలు కొడకండ్ల వెంకటరెడ్డి, సున్నం నాగమణి, వగ్గెల పూజ మాట్లాడారు. సమావేశంలో దారా వెంకటేశ్వరరావు, మెడా మోహన్‌రావు, నరుకుళ్ల సత్యనారాయణ, సూరా వెంకటేశ్వర్లు, నల్లమోతు వెంకటనారాయణ, చీదళ్ల పవన్‌బాబు పాల్గొన్నారు.

నామా గెలుపునకు ప్రచారం

అన్నపురెడ్డిపల్లి: ఎన్నికలలో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి నామా నాగేశ్వరరావును అధిక మెజార్టీతో గెలిపించాలని మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు కోరారు. సోమవారం మండల పరిధిలోని తొట్టిపంపు గ్రామంలో ఉపాధి పని వద్ద కు వెళ్లి ప్రచారం చేసి, నామాకు ఓటు వేయాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో ఆ పార్టీ మండలాధ్యక్షుడు బోయినపల్లి సుధాకర్, ఎంపీటీసీ కృష్ణారెడ్డి, నాయకులు భారత రాంబాబు, గోపీనాద్, హరీష్, వడ్డే సత్యం, భూపతి నరసింహారావు, చల్లా రమేష్, చల్లారాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ములకలపల్లి: ఖమ్మం ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న నామా నాగేశ్వరరావును అత్యధిక మెజార్టీతో గెలిపించాలని జెడ్పీటీసీ సున్నం నాగమణి, ఎంపీటీసీ శనగపాటి మోహరమణి ఓటర్లను కోరారు. నామా విజయాన్ని కాంక్షిస్తూ సోమవారం విస్తృతంగా ప్రచారం చేశారు. మండల కేంద్రంలోని గన్నేరు చెరువు, కృష్ణమ్మ చెరువు సమీపంలో పనులు చేస్తున్న ఉపాధి కూలీలతో మాట్లాడారు. ములకలపల్లి గ్రామశాఖ అధ్యక్షుడు పుష్పాల హనుమంతు, ప్రధాన కార్యదర్శి ఐతంరాజు నాగేశ్వరరావు, బండి కొమరయ్య, శనగపాటి సీతారాములు, సున్నం బాబూరావు, మోటా రవి, హుస్సేన్, బొర్రా రవి, కొట్టే శేషు తదితరులు పాల్గొన్నారు.

అశ్వారావుపేటరూరల్: బీఆర్ఎస్ పార్టీ ఖమ్మం ఎంపీ అభ్యర్థిగా పోటీలో ఉన్న నామ నాగేశ్వరరావును గెలిపించాలని ఆ పార్టీ స్థానిక ఎంపీపీ జల్లిపల్లి శ్రీరామ్మూర్తి కోరారు. సోమవారం మండలంలోని పలు గ్రామాల్లో ప్రచారం నిర్వహించగా ఆయన మాట్లాడారు. కార్యక్రమాల్లో పార్టీ నాయకులు మందపాటి మోహన్‌రెడ్డి, యూఎస్ ప్రకాశ్‌రావు, జేకేవీ రమణారావు, సంకా ప్రసాద్, తాడేపల్లి రవి, అంకత మల్లికార్జున్‌రావు పాల్గొన్నారు.

ఉన్నత లక్ష్యాలకు ఇష్టపడి చదవాలి



విద్యార్థులతో ప్రిన్సిపాల్ రాజారామ్, ఉపాధ్యాయులు

బూర్గంపాడు: ఉన్నత లక్ష్యాలను సాధించాలంటే విద్యార్థులు ఇష్టపడి చదవాలని ఏటూరునాగారం టీటీడబ్ల్యూఆర్‌జేసీ ప్రిన్సిపాల్ తోకల రాజారామ్ అన్నారు. మండల కేంద్రం బూర్గంపాడులోని అంబేడ్కర్‌కాలనీలో టెన్త్, ఇంటర్మీడియట్‌లలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను ఏబీఆర్ యూత్ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ప్రిన్సిపాల్ రాజారామ్ మాట్లాడుతూ.. పిల్లలు చదువుల్లో రాణించాలంటే తల్లిదండ్రులు ప్రోత్సాహం తప్పనిసరిగా ఉండాలన్నారు. విద్యార్థులు ఏకాగ్రత, పట్టుదలతో చదువుల్లో రాణించాలన్నారు. విద్యాభివృద్ధితోనే దేశాభివృద్ధి సాకారమవుతుందన్నారు. విద్యార్థులు ఎవరూ చదువులను మధ్యలో నిలిపివేయవద్దని సూచించారు. వచ్చే ఏడాది నుంచి ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలను అందిస్తామని ఏబీఆర్ యూత్ ప్రతినిధులు తెలిపారు. సీనియర్ జర్నలిస్ట్ తోకల మోహన్‌రావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కేసుపాక పుల్లయ్య, మాధవి, రఘురామ్, వేణు,అనూష, ఇసంపల్లి వెంకటేశ్వర్లు, రాయల వెంకటేశ్వర్లు, రవిప్రసాద్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు



కేక్ కటింగ్ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాయం

మణుగూరుటౌన్: పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు జన్మదిన వేడుకలను కాంగ్రెస్ పార్టీ నాయకుల ఆధ్వర్యంలో సోమవారం ప్రజాభవన్‌లో ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు మణుగూరులోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయానికి, నివాసానికి వెళ్లి ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పుష్పగుచ్ఛాలు అందించి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలపడంతో పాటు శాలువాలతో ఘనంగా సన్మానించారు. తొలుత ప్రజాభవన్‌లో కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లుతో కేక్ కట్ చేయించి మిఠాయిలను పంపిణీ చేశారు. ఎమ్మెల్యే పాయంకు శుభాకాంక్షలు తెలిపిన వారిలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పీరినాకి నవీన్, ఎంపీటీసీ కోటేశ్వరరావు, నాయకులు దొబ్బల వెంకటప్పయ్య, సామా శ్రీనివాస్‌రెడ్డి, గాండ్ల సురేష్, మాదాడి రాజేష్, మహిళా నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వంపై తిరుగుబాటు మొదలైంది..

మణుగూరురూరల్: తెలంగాణ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన ఐదు నెలలకే కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో తిరుగుబాటు మొదలైందని, ఏ గ్రామానికి వెళ్లి కేసీఆర్ పాలనే కావాలని కోరుకుంటున్నారని మణుగూరు జెడ్పీటీసీ పోశం నర్సింహారావు అన్నారు. సోమవారం మండలంలోని కట్టుమల్లారం, తోగ్గూడెం గ్రామంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో జోరుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బీఆర్ఎస్ పథకాలను వివరిస్తూ.. కరపత్రాలను పంపిణీ చేశారు. ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసి మాలోత్ కవితను ఎంపీగా గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ మాట్లాడుతూ.. మాజీ సీఎం కేసీఆర్ అమలు చేసిన పథకాలనే రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కొనసాగిస్తుందే తప్ప.. ఇచ్చిన హామీలను ఐదు నెలలు కావస్తున్నా ప్రజలకు చేరవేయడం లేదని విమర్శించారు. సమావేశంలో మాజీ సర్పంచ్‌లు బొగ్గం రజిత, జగిడి జ్యోతి, ఏనిక ప్రసాద్, మండల కోఆప్షన్ సభ్యులు జావిద్‌పాషా, మాజీ ఎంపీటీసీలు వల్లభనేని రమణ, మేకల రవి, బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి రామిరెడ్డి, ఆర్ వెంటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కూటమి అభ్యర్థిని గెలిపించాలి



మణుగూరురూరల్: మాట్లాడుతున్న ఇఫ్టూ జిల్లా అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి

మణుగూరురూరల్: ఈ నెల 13వ తేదీన జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో కార్మిక హక్కులను కాలరాస్తున్న మతోన్మాద, ఫాసిస్ట్ బీజెపి కూటమిని ఓడించి, ప్రజాస్వామిక, ప్రజాతంత్ర హక్కుల కోసం ఇండియా కూటమి అభ్యర్థిని గెలిపించాలని ఇఫ్టూ జిల్లా అధ్యక్షుడు ఆర్.మధుసూదన్‌రెడ్డి కోరారు. సోమవారం పలు విభాగాల్లో సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కేంద్రంలోని ప్రధాని మోడి ప్రభుత్వం కార్మిక శ్రమను కారుచౌకగా కార్పొరేట్ శక్తులకు కట్టబెడుతూ.. హక్కులను, చట్టాలను కాలరాసేందుకు ప్రయత్నిస్తోందన్నారు. ప్రశ్నించిన వారిని దేశ ద్రోహులుగా ముద్ర వేసి అక్రమ కేసులు బనాయిస్తూ జైల్లో నిర్బంధిస్తోందన్నారు. ప్రజా, కార్మిక హక్కులు, చట్టాల పరిరక్షణ కోసం ఎన్నికల్లో ఇండియా కూటమిని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

ములకలపల్లి: లోక్‌సభ ఎన్నికల్లో ఇండియా కూటమి అభ్యర్థులను గెలిపించాలని సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర నాయకుడు ముద్దా భిక్షం పిలుపునిచ్చారు. ములకలపల్లి పార్టీ కార్యాలయంలో మండల కార్యదర్శి కొర్సా రామకృష్ణ అధ్యక్షతన సోమవారం నిర్వహించిన జనరల్ బాడీ సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడారు. మతోన్మాద బీజేపీని, దాని మిత్రపక్షాలను విశ్వసించవద్దని సూచించారు. జిల్లా కార్యవర్గ సభ్యుడు నూపా భాస్కర్, జిల్లా కమిటీ సభ్యులు పోతుగంటి లక్ష్మణ్, నిమ్మల రాంబాబు, డివిజన్ నాయకులు పూనెం రమేశ్, గోనెల రమేశ్, మండల కమిటీ సభ్యులు యర్రగొర్ల రామారావు, పుష్పాల నాగేశ్వరరావు, ఓరుగంటి శ్రీను, పద్దం లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

అశ్వాపురం: మండల పరిధిలోని మొండికుంట-బీజీ కొత్తూరు గ్రామాల మధ్య సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. బీజీకొత్తూరు గ్రామానికి చెందిన మధుసూదన్‌రెడ్డి, పాల్వంచకు చెందిన ఈశ్వర్ మణుగూరు-కొత్తగూడెం ప్రధాన రహదారిపై రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొట్టడంతో ఇద్దరికి గాయలయ్యాయి. స్థానికులు క్షతగాత్రులను 108లో భద్రాచలం ఏరియా ఆస్పత్రికి తరలించారు.

మతతత్వ బీజేపీని ఓడిద్దాం

చంద్రుగొండ: మతతత్వ బీజేపీని ఓడిద్దామని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ పార్టీ జిల్లా నాయకులు ఎస్‌కె.ఉమర్ పిలుపునిచ్చారు. చంద్రుగొండలో సోమవారం జరిగిన పార్టీ ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీజేపీ పాలనలో దేశంలో ఇప్పటికే మతం పేరిట అలజడులు చెలరేగుతున్నాయని, మళ్లీ ఆ పార్టీ అధికారంలోకి వస్తే పరిస్థితులు మరింత దిగజారుతాయని ఆయన హెచ్చరించారు. రాజ్యాంగ మార్పిడితోపాటు రిజర్వేషన్లు రద్దు చేయడం ఖాయమన్నారు. ఈ సమావేశంలో ఆ పార్టీ నాయకులు వరికూటి వెంకట్రావ్, కుంజా కృష్ణ, కె.సత్యనారాయణ, తోలెం వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక

చర్ల: మండలానికి చెందిన పలువురు బీఆర్ఎస్ పార్టీ నాయకులు సోమవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సమక్షంలో ఖమ్మంలో వారంతా కాంగ్రెస్‌లో చేరగా.. మంత్రి వారికి కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కాంగ్రెస్ పార్టీలో చేరిన వారిలో బీఆర్ఎస్ నాయకులు రైతుబంధు సమితి మండల అధ్యక్షుడు కొసరాజు రాజా, సత్యనారాయణపురం సహకార సంఘం ఉపాధ్యక్షులు నాగరాజు, మాజీ ఎంపీటీసీ సభ్యులు ఆలెం ఈశ్వరరావు, మాజీ ప సర్పంచ్ శ్యామల శివ, బోళ్ల వినోద్, అలవాల మహేష్, చల్లకోటి వాసుదేవరావు ఉన్నారు.

బ్యాంక్ స్టేట్‌మెంట్ తీసుకోవాలి

ములకలపల్లి: రూ.50వేల కంటే ఎక్కువ నగదు డ్రా చేసే ఖాతాదారులు విధిగా బ్యాంక్ అకౌంట్ స్టేట్‌మెంట్ తీసుకోవాలని ములకలపల్లి ఎస్‌బీఐ మేనేజర్ రాజేంద్రనాయక్ తెలిపారు. స్థానిక బ్యాంక్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల నియమావళి అమలులో ఉన్నందున రూ.50 వేలు, ఆ పైచిలుకు నగదు వెంటతీసుకెళ్లే వారు తప్పనిసరిగా తగిన ఆధారాలు కలిగి ఉండాలన్నారు. నగదు తీసుకెళ్లడం కన్నా, ఆన్‌లైన్ ట్రాన్స్‌ఫర్ శ్రేయస్కరమని అన్నారు.

రేపు సర్వసభ్య సమావేశం

దుమ్ముగూడెం: దుమ్ముగూడెం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం బుధవారం మధ్యాహ్నం 2 గంటలకు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ కె.ఈదయ్య ఓ ప్రకటనలో తెలిపారు. మండల పరిషత్ అధ్యక్షురాలు రేసు లక్ష్మి అధ్యక్షతన నిర్వహించే ఈ సర్వసభ్య సమావేశానికి ప్రజాప్రతినిధులతో పాటు అన్ని శాఖల అధికారులు సకాలంలో హాజరుకావాలని, ముందస్తు సమాచారం ఇవ్వకుండా సమావేశానికి గైర్హాజరయ్యే అధికారులపై చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

కవితను గెలిపించండి



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు

దుమ్ముగూడెం: మహబూబాబాద్ పార్లమెంట్ స్థానం నుంచి బీఆర్ఎస్ పార్టీ తరుపున బరిలో ఉన్న మాలోత్ కవితను గెలిపించాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు పిలుపునిచ్చారు. సోమవారం మండలంలోని మారాయిగూడెం పంచాయతీలో ఉన్న పత్తిపాకలో సమావేశం ఏర్పాటు చేయగా.. ఆయన మాట్లాడారు. అమలుకాని, అబద్ధపు మాటలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ మరోమారు ప్రజలను మోసపుచ్చేందుకు యత్నిస్తోందని ఆయన అన్నారు. కాంగ్రెస్ మాయమాటలు నమ్మవద్దని ఆయన కోరారు. పార్లమెంట్ ఎన్నికల్లో మాలోత్ కవితను అత్యదిక మెజారిటీ గెలిపించాలని ఆయన కోరారు. సమావేశంలో నియోజకవర్గ నాయకులు మానె రామకృష్ణ, సీనియర్ నాయకులు సాగి శ్రీనివాసరాజు, మండల అధ్యక్ష, కార్యదర్శులు అన్నె సత్యనారాయణమూర్తి, కనితి రాముడు, ఎంపీపీ రేసు లక్ష్మి, ఉపాధ్యక్షుడు తునికి కామేష్, అపకా వీర్రాజు నాయకులు కొత్తా మల్లేష్, అపకా శ్రీను, వెంకటేష్, పొడియం సుబ్బారావు, కారం వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నాయకుల ప్రచారం



అశ్వాపురం: రామచంద్రాపురంలో కరపత్రాలు, గ్యారంటీ కార్డులు అందజేస్తున్న నాయకులు

మణుగూరురూరల్: ఈ నెల 13వ తేదీన జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ మహబూబాబాద్ అభ్యర్థి పోరిక బలరాం నాయక్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ప్రజలకు, ఉపాధి కూలీలకు విజ్ఞప్తి చేశారు. సోమవారం మండల పరిధిలోని ముత్యాలమ్మనగర్ గ్రామపంచాయితీలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో విస్తృతంగా ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ ప్రచారంలో ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మాట్లాడతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే ఐదు గ్యారెంటీలను ప్రజలకు అందిస్తూ.. వారి సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా ముందుకు సాగుతోందన్నారు. జరగబోయే ఎన్నికల్లో హస్తం గుర్తుకు ఓటు వేసి బలరాం నాయక్‌ను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పీరినాకి నవీన్, నాయకులు పాలమూరి రాజు, గాండ్ల సురేష్, ఎంపీటీసీ కోటేశ్వరరావు, టీవీ సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అశ్వాపురం: ఈ నెల 13న జరగనున్న లోక్‌సభ ఎన్నికల్లో మహబూబాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి బలరాంనాయక్ గెలుపు కోసం పార్టీ శ్రేణులు కృషి చేయాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఓరుగంటి భిక్షమయ్య అన్నారు. భిక్షమయ్య ఆధ్వర్యంలో మండల పరిధిలోని అమ్మగారిపల్లి, రామచంద్రాపురం, నెల్లిపాక, మొండికుంట, మల్లెలమడుగు, సీతరాంపురం, ఆమెర్ద, గొల్లగూడెం, తుమ్మలచెరువు, వెంకటాపురం గ్రామాల్లో బూత్‌ల వారిగా పార్లమెంట్ అభ్యర్థి బలరాంనాయక్ గెలుపు కోసం పోస్టర్లు, గ్యారంటీ కార్డులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమాల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు గాదె కేశవరెడ్డి, ఓరుగంటి రమేష్‌బాబు, సదర్ లాల్, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, బూరెడ్డి వెంకటరెడ్డి, గొల్లపల్లి నరేష్, శశికాంత్, గాదె వెంకటరెడ్డి, కాకా అశోక్, రాగం మల్లయ్య, బేతం రామకృష్ణ, చెంచల రాము, పర్వత నరేష్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పోలీసుల ఫ్లాగ్ మార్చ్



మణుగూరురూరల్: ఫ్లాగ్ మార్చ్‌లో డీఎస్పీ రవీందర్‌రెడ్డి, సీఆర్‌పీఎఫ్ డీఎస్పీ వృశాలిని

మణుగూరురూరల్: మణుగూరు సబ్ డివిజన్ పోలీస్‌శాఖ, సీఆర్‌పీఎఫ్ ఆధ్వర్యంలో మణుగూరు పట్టణంలో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. పట్టణంలోని సుర్జా బస్టాండ్ నుంచి ఆరంభమైన మార్చ్.. తెలంగాణ చౌరస్తా, సినిమాహాల్ సెంటర్, అంబేడ్కర్ సెంటర్, సాయిబాబా గుడి మీదుగా తిరిగి అంబేడ్కర్ సెంటర్‌కు చేరుకుంది. అక్కడ నుండి కమలాపురం వైపు ఫ్లాగ్ మార్చ్ కొనసాగింది. ఈ సందర్భంగా మణుగూరు డీఎస్పీ వంగ రవీందర్ రెడ్డి, సీఆర్‌పీఎఫ్ డీఎస్పీ వృశాలినిలు మాట్లాడుతూ... ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధమన్నారు. ప్రతీ ఒక్క ఓటరు ఎలాంటి ప్రలోభాలకు గురి కాకుండా నిర్భయంగా ఓటు హక్కును వినియోగించువాలన్నారు. కార్యక్రమంలో సీఐ ఎస్.సతీష్‌కుమార్, ఏడూళ్ళబయ్యారం సీఐ కరుణాకర్, అశ్వాపురం సీఐ అశోక్‌రెడ్డి, ఎస్సైలు రాజేష్, ప్రసాద్, వెంకటప్పయ్య, రాజేందర్, సురేష్, తిరుపతి, పోలీస్, సీఆర్‌పీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

ములకలపల్లి: ఓటర్లు స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని పాల్వంచ డీఎస్పీ కె.సతీష్‌కుమార్ సూచించారు. ఎన్నికల నేపథ్యంలో ములకలపల్లి మండలకేంద్రంలో సోమవారం పోలీసులు ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడారు. ప్రలోభాలకూ లొంగకుండా ఓటేయాలని పిలుపునిచ్చారు. పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. నగదు, మద్యం అక్రమ రవాణాపై పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. పాల్వంచ, అశ్వారావుపేట సీఐలు వినయ్‌కుమార్, జితేందర్‌రెడ్డి, ఎస్సైలురాజమౌళి, సాయికిషోర్‌రెడ్డి, శ్రీరాముల శ్రీను పాల్గొన్నారు.

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నెంబర్లకు ఉదయం 7-00 గం॥ల నుండి రాత్రి 8-00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే చర్యలు తీసుకోబడును.

కె. ప్రదీప్ కుమార్, ACM - 70132 21824 లక్ష్మయ్య, ACO - 8074270476
కొత్తగూడెం యాకూబ్ పాషా - 80083 21148 భద్రాచలం కె. హరేంద్ర - 99632 02011
పినపాక ఎన్. లక్ష్మయ్య - 80742 70476 ఇల్లందు బి. కిషన్ - 63052 41411
అశ్వారావుపేట ఎన్. దుర్గారాంప్రసాద్ -79979 58226 టోల్‌ఫ్రీ నెం.: 1800 270 1083

సాక్షి పాఠక మహాశయులకు విజ్ఞప్తి
Land Line : 08742-282823 / 24

మీరు సాక్షిలో వివాహ, జన్మదిన, పదవీ విరమణ, విదేశీ పర్యటన, స్వదేశాగమనం, అవార్డు గ్రహీతలకు శుభాకాంక్షలు, మీ ఆత్మీయులకు శ్రద్ధాంజలి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, బహిరంగ ప్రకటనలు, అతి తక్కువ ఖర్చుతో కొండత స్పందన లభించే క్లాసిఫైడ్ యాడ్స్ ఇవ్వదలచినచో మీరు సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లు : ఎన్. నాగశేషు, యాడ్స్ మేనేజర్- 99122 20600

యస్.రవిబాబు - 99516 02914
కె. మధు - 97059 44416